# రాతివనం

పక్క గదిలోంచి పదిహేనేళ్ళ వంశోద్ధారకుడి గొంతు తారస్థాయిలో విన్పిస్తోంది.

"వంద రూపాయలు అర్జెంటుగా కావాలి మమ్మీ" అంటున్నాడు వాడు.

"అంత డబ్బు నీకెందుకురా?" అరుస్తున్నట్లే మాట్లాడుతోంది శ్రీమతి.

"ఎందుకంటే ఏంచెప్పను? నాకవసరం అంతే" మొండిగా ఖరాఖండిగా చెప్తున్నాడు.

నేను రంగప్రవేశం చేయక తప్పదనిపించింది.

చాలా ప్రశాంతంగా ఇద్దరి దగ్గరకూ నడిచి, శ్రీమతి పక్కకెళ్ళి నిలబడ్డాను.

"నీ ఎదురుగానే ఉన్నారుగా. నాన్నగారినే అడుగు" అంది తను.

"ఆయనకు విన్పించేట్లే ఇందాకట్నుంచీ అడుగుతున్నాగా అన్నాడు మా వంశాంకురం - నా వైపు నిరసన చూపొకటి చూసి.

గుండెల్లో ముల్లులా గుచ్చుకుందా చూపు....

అయినా సౌమ్యంగా "ఎందుకో మాకు చెప్పకూడని విషయమా" అన్నాను కావాలనే వ్యంగ్యంగా....

వాడు నావైపోసారీ - వాళ్ళ అమ్మవైపోసారి మార్చి మార్చి చూశాడు.

"ఏనాటికైనా మీకు తెలియాల్సిన విషయమే కదా. నా గుండెల్లో అగ్నిగుండంలా మండుతోన్న ఈ నిజం బైటపడక మానుతుందా - పాతకాలం నాటి, తుప్పుపట్టిన మీ ఛాందస భావాల్ని మసి చేయక మానుతుందా"

నాకు క్షణం కళ్ళు తిరిగాయి.

వృత్తిరీత్యా లాయర్నైన నేను "మండేనిజం" లాంటి పదాల్ని మచ్చుకైనా తట్టుకోలేను.

అర్ధాంగివైపు చూశాను. ఆవిడ ఆశ్చర్యంతో - బొమ్మలా - వాడివైపే చూస్తోంది - అనిమీలిత నేత్రియై.

"ఏమిట్రా - నువ్వు మాకు పుట్టలేదని ఏ అడ్డమైన వెధవైనా కూశాడా" అన్నాను.

"అవన్నీ పాత సినిమాల్లోని అరిగిపోయిన సెంటిమెంట్స్ డాడి. నాకు డబ్బుకావాలి. నాకిష్టమైన ప్రియమైన శైలజ బర్త్‌డే రేపు. ప్రజంటేషన్ కొనాలి". 'ప్రియమైన శైలజ' అని పలికేటపుడు వాడి కళ్ళు అరమోడ్పులయ్యాయి. పరమాత్మ సాక్షాత్కారంతో ఆత్మచెందే అనుభూతి పొందుతున్నట్లు.

"శైలజ ఎవర్రా?"

"ఎవరని చెప్పను డాడీ - నా జీవనవనంలోకి కాలూనిన, ఆమని అని చెప్పనా - నిబిడాంధకారం లాంటి నా జీవితంలో తటిల్లతలా విరిసిన అద్భుతమైన ఓ మెరుపు పూవని చెప్పనా - నా హృది వీణను మధురంగా మీటుతున్న మహా వైణికురాలని చెప్పనా - నా ప్రాణమనీ - శ్వాస అనీ - సర్వస్వమనీ -...."

"కవిత్వం కాదురా - ఎవరా అమ్మాయి"

"కవిత్వమా - మీకు కవిత్వంలా విన్పిస్తుందా - కాదు డాడీ - నా హృదాంతరాళాల్లోంచి ఉబికి వస్తున్న నిజాల నిర్నిద్రగానాలు - నీరవ నిశ్శబ్ద నిశీధిలో ఆకాశం మీంచి అలవోకగా నా గుండెల మీద తొణికిన తుహిన కణం లాంటి ఆమె ప్రేమ నాకు దేవుడు ప్రసాదించిన అపురూపమైన వరం."

తీయని కలకంటున్నట్లు కళ్ళు మూసుకుని మరీ చెప్తున్నాడు వాడు.

నా మెదడులోంచి మిస్సైల్స్ దూసుకుపోతున్నట్లు - శతఘ్నులు ఫెటేల్మని పేలుతున్నట్లు - ఆసరా కోసం మా ఆవిడ భుజాన్ని పట్టుకున్నాను.

"ప్రేమా - నీ వయసుకి ప్రేమ ఏమిట్రా" శక్తిని కూడదీసుకుని అడిగాను. అగాధంలోంచి వస్తున్నట్లు బలహీనమైన నా గొంతు -

"ప్రేమకు వయసుతో పనేమిటి డాడి - మా ప్రేమ ఈ తుచ్ఛమైన నిగళాలను ఏ నాడో తెంపుకుని విశాలాకాశంలో విహంగంలా విహరిస్తోంది. మా ప్రేమ పవిత్రమైనది. అనిర్వచనీయమైనది, అజరామరమైనది".

"నోర్ముయ్ - ఏమిటా వాగుడు" భార్యామణి కసిరింది. ఆవిడ భుజం నా చేతి కింద

సన్నగా వణకటం నాకు స్పష్టంగా తెలుస్తూనే ఉంది.

"నాకు తెలుసు మమ్మీ మీరిలా మా ప్రేమని నిరాకరిస్తారనీ - దాన్ని త్రుంచేసే ప్రయత్నం చేస్తారనీ - తరతరాలుగా చరిత్ర చెప్తున్న నిజం యిదే. నేను చెప్పేది కూడా మీరు జాగ్రత్తగా వినండి. ప్రపంచం అంతా ఒక్కటై నిలిచినా - హరిహరాదులడ్డొచ్చినా - మమ్మల్ని విడదీయలేరు మమ్మీ - మా హృదయాలు ఏనాడో కలిశాయి - మా శరీరాలు..."

"ఆపరా" నీర్సంగా అనేసి అక్కడే కూలబడిపోయాను.

"నన్నాపకండి. చెప్పనివ్వండి. మా శరీరాలు విడిపోయినా మా ఆత్మల్ని మీరు విడదీయలేరు".

హమ్మయ్య - ఎంత భయపడి చచ్చానో - శరీరాలు కూడా కలిశాయంటాడే మోనని - కొద్దిగా ఓపిక వచ్చింది. లేచి నిలబడపోయాను.

"శైలజ నాన్నగారు - అదే నా కాబోయే మామగారు - తన కూతురు ఓ ప్లీడర్ కొడుకుని ప్రేమించడం కంఠంలోప్రాణం ఉండగా ఒప్పుకోరని తెలుసు. ఆయన జడ్జిగారు కదా - అయినా సరే... నేను శైలజనే భార్యగా పొంది తీరుతాను"

నాకు "జడ్జిగార"నే పదం విన్నప్పుడే స్పృహ తప్పింది.

☆☆☆

రాత్రంతా ఆలోచనలతో నిద్రలేని నాకు ఉదయం వాడు స్కూలుకు వెళ్తున్నప్పుడు నడిచిన నడక చూసి చప్పున స్ఫురించింది. ఆ నడక ఎక్కడో చూసినట్లు. ఓ అరగంట బుర్ర బద్దలు కొట్టుకున్నాక గుర్తొచ్చింది. అది ఓ తెలుగు సినిమాలో ఓ కుర్ర హీరో నడక అని.

చాలా రోజులైంది తెలుగు సినిమాలు చూసి.

వరుసగా మూడు రోజులు మూడు సినిమాలుచూశాను. అన్నీ ఆ హీరో నటించిన తెలుగు సినిమాలే.

ఒక దాంట్లో ఆ హీరో ఓ ఫ్యాక్టరీలో కార్మికుడు. తన ఫ్యాక్టరీ యజమాని కూతుర్ని ప్రేమిస్తాడు. అన్ని అడ్డంకులూ అధిగమించి ఆ అమ్మాయిని పెళ్లి చేసుకుంటాడు. మరో సినిమాలో ఓ ఖైదీని జైలర్ కూతురు ప్రేమిస్తుంది. యింకో సినిమాలో ఓ పాలేరు భూస్వామి

కూతుర్ని ప్రేమిస్తాడు. ఈ మూడు సినిమాల్లో కూడా హీరో వయసు పదిహేడు - హీరోయిన్ వయసు పదహారు అని చెప్పడానికి పాటలో - మాటలో - సింబాలిక్ షాట్స్ ఉన్నాయి. అన్నిట్లోనూ దాదాపు మా పుత్రరత్నం మాట్లాడిన డైలాగ్స్ ఉన్నాయి.

ఇకనుంచి వీడిని తెలుగు సినిమాలు చూడకుండా కట్టుదిట్టం చేయాలని నిర్ణయించుకున్నాను.

భోజనాలయాక శ్రీమతి టివీ పెడితే చూస్తూ కూచున్నాం "చాలా మంచి నాటకం ఉందండీ ఇపుడు" అంటూ శ్రీమతి పక్కన వచ్చి కూచుంది. నాటకం ప్రారంభమైంది. అందులో హీరో రిక్షా తొక్కుతుంటాడు. రోజూ తన రిక్షాలోనే తాసిల్దారుగారి అమ్మాయిని కాలేజికి తీసుకెళ్తుంటాడు. వాళ్ళ మధ్య ప్రేమ చిగురిస్తుంది.

"రోషి - క్షితిజం దగ్గిర నింగీ నేలా సంగమంలా మన కలయిక చాలా అపురూపమైనది' అంటున్నాడు హీరో రిక్షా పెడల్ మీద ఓ కాలు, నేలమీద ఓ కాలు పెట్టి - వాడికింకా మీసాలు కూడా సరిగా వచ్చినట్టు లేదు. నాకు కొద్దిగా కళ్ళు తిరిగాయి.

వెంటనే లేచి వెళ్ళి టీవీ ఆపేశాను - రేపు దీన్ని తప్పకుండా సగం రేటుకైనా సరే అమ్మేయాలని నిర్ణయించుకుని.

పడక మీద మేను వాల్చాను. ఏమీ తోచక, పక్కనే ఉన్న తెలుగుపత్రిక ఒకటి చేతిలోకి తీసుకున్నాను. యధాలాపంగా ఓ కథ తిరగేశాను. ఆ కథలో హీరో ఓ కాలేజీలో ప్యూను. కాలేజి ప్రిన్సిపాల్ కూతుర్ని ప్రేమిస్తుంటాడు. ఓ రోజు పార్క్‌లో ఆమె చేయి పట్టుకుని " ప్రియా -నీ ప్రేమామృతాన్ని గ్రోలి పరవశించిన నా మది గండుతుమ్మెదలా ఝుమ్మని నాట్యం చేస్తోంది. నీ వలపు తలపుకు - ఓ తీయటి పిలుపుకు - నా తనువు ఝుల్లుమని..."

నాకేమీ కన్పించటం లేదు. - ఏమీ విన్పించటం లేదు. బహుశా స్పృహ తప్పి ఉంటుంది.

● ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక 31 మే, 1991 ●